

## తిరుపతి సిఆర్ఎస్.. రైల్వే జిఎం తనిఖీ

తిరుపతి, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాప్ (సి.ఆర్.ఎస్)ను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆయనతో పాటు తిరుపతి సిఆర్ఎస్ చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, గుంతకల్లు డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ యు.సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్‌లో షాప్ పనితీరుతో పాటు వందే భారత్ కోచ్‌లు, సాంప్రదాయ ఎ.సి కోచ్‌లను కూడా తనిఖీ చేశారు. సి.ఎఫ్ (క్యారేజ్ ఫిట్టింగ్) షాప్, బోగీ సెక్షన్, వీల్ ప్రెస్ మెషిన్, ఎ.జె.టి.బి (ఆటోమేటిక్ జర్నల్ టర్నింగ్ బరనిషింగ్) మెషిన్ వంటి ప్రతి విభాగం పనిని సమీక్షించి, వర్క్‌షాప్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అవుట్‌గోయింగ్ షాప్‌లోని కోచ్‌లను, బయోటాయిలెట్లను, ఓవర్‌హాలింగ్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. వర్క్‌షాప్‌లో అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలను సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పరిశీలించారు. వర్క్‌షాప్ సిబ్బందితో సంభాషించారు. విధుల్లో ఉన్నప్పుడు పాటించాల్సిన భద్రతా జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్క్‌షాప్ అధికారులు మాస్టర్ ప్లాన్‌ను జనరల్ మేనేజర్‌కు వివరించారు. వర్క్‌షాప్ విస్తరణకు సంబంధించిన భవిష్యత్తు ప్రణాళికల గురించి వివరించారు. తరువాత క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్ అధికారులు వర్క్‌షాప్ పనితీరు, పురోగతి గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ తనిఖీ సమయంలో జనరల్ మేనేజర్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో సంభాషించి విజ్ఞప్తులను స్వీకరించారు. ఉత్పాదకత, నాణ్యత, అన్నింటికంటే మించి హౌస్ కీపింగ్, ప్రయాణీకుల భద్రతను పెంపొందించడానికి సాంకేతిక మెరుగుదల చొరవలతో మార్పులను స్వీకరించడానికి చేసిన ప్రయత్నాలకు గాను అధికారులు, సిబ్బంది బృందాన్ని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రశంసించారు. వర్క్‌షాప్ మరింత సమర్థవంతంగా పనిచేసి దక్షణ మధ్య రైల్వే ప్రతిష్టను మరింత పెంచాలని ఆకాంక్షించారు.

## ప్రధానోపాధ్యాయురాలికి మంత్రి లోకేష్ ప్రశంస



శ్రీకాకుళం, మార్చి 2 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యా యినిగా విధులు నిర్వహిస్తున్న కూర్మాన అరుణ కుమారి టీచర్ సృజనాత్మక బోధనతో విద్యా శాఖ మంత్రి లోకేష్ మన్ననలు అందుకున్నారు. ఆమె పాఠాల్లో విషయాన్ని బొమ్మలు, షార్ట్ ఫిల్మ్స్, వర్కింగ్ మోడల్స్‌తో పాఠాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్, రాష్ట్ర, జాతీయస్థాయి విద్యా శిక్షణలో కెఆర్‌పిగా మాడ్యూల్ రచయితగా, ఈ కంటెంట్ సృష్టికర్తగా అరుణకుమారి టీచర్ ఎనలేని కృషి ఎనలేనిదని ప్రశంసించారు.



## నగరవనంలో వాకర్స్‌కు ప్రవేశరుసుం

### - అటవీశాఖ తీరుపై వాకర్స్ నిరసన

తిరుపతి, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో నివాసముంటున్న సీనియర్లు, వాకర్స్ ప్రతిరోజూ నడక చేసుకునేందుకు వీలుగా కపిలతీర్థం సమీపంలోని అటవీశాఖ నగరవనంలో వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేసింది. ఈ ట్రాక్‌పై కొన్నేళ్ళుగా వాకర్స్ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నడక చేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఉన్నఫళంగా అటవీశాఖ అధికారులు నగరవనంలో వాకింగ్‌కు ప్రవేశరుసుం అమలుచేసి వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంది. సోమవారం ఉదయం నగరవనంలో వాకింగ్‌కు వెళ్ళిన వారిని ప్రవేశరుసుం చెల్లిస్తేనే లోపలకు అనుమతినిస్తామని అటవీ సిబ్బంది నిలుపుదల చేశారు. దీంతో వాకర్స్ తిరుమల బైపాస్‌రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తిరుపతి నుండి తిరుమలకు వెళ్ళే వాహనాలు, చిత్తూరు వైపు వెళ్ళే వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ స్తంభించింది. సమస్య తెలుసుకున్న అలిపిరి సిఐ రామకిషోర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని డిఎఫ్ఒతో చర్చించి సమస్య పరిష్కరించుకుందామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తిరుపతి నగరం కపిలతీర్థం పరిసరాల్లోని కాలనీవాసులు. సీనియర్లు, టిటిడి విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యం కాపాడడానికి అటవీశాఖ దివ్యరామంలో నడక కోసం వెళుతుంటారు. అటవీ ప్రాంతానికి దిగువనే అహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో మంచి వాతావరణం ఉంది. వాకింగ్‌కు అడ్డంకులు కలిగించడం అటవీశాఖ డిఎఫ్ఒ వ్యవహరించడం సరికాదన్నారు. జంతువులను సంరక్షించాల్సిన అధికారులు ఆ వనం నుంచి జంతువులు బయటకు వస్తుంటే పరిరక్షించలేదని ఆవేదన చెందారు. లోపల ట్రాక్ కూడా గుంతలమయంగా మారిందన్నారు. ఈ నిరసనలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీధర్, జయకుమార్, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్.జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సురేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నేడు చంద్రగ్రహణం

- పలు దేవాలయాలు మూసివేత
- శివాలయాల్లో యథాతథంగా పూజలు, భక్తులకు దర్శనం




విజయవాడ, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: చంద్రగ్రహణం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ప్రముఖ ఆలయాలను మూసివేయనున్నారు. ఈ క్రమంలోనే తిరుమల, తిరుపతితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని టిటిడి స్థానిక ఆలయాలను మూసివేయనున్నట్లు టిటిడి ప్రకటించింది. చంద్రగ్రహణం ముగిసిన తర్వాత ఆ రోజు రాత్రి ఆలయాల తలుపులు తెరిచి శుద్ధి చేయనున్నారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఉంటుంది. మరోవైపు మధ్యాహ్నం 3 గంటల 20 నిమిషాలకు చంద్రగ్రహణం ప్రారంభమవుతుంది. సాయంత్రం 6.47 గంటల వరకు గ్రహణం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే గ్రహణ సమయానికి 6 గంటల ముందే ఆలయాల తలుపులు మూసివేయనున్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, సూర్యనారాయణస్వామి ఆలయం, శ్రీనివాస ఆలయం, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, శ్రీనివాస మంగాపురంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం మూసివేయనున్నారు. చంద్రగ్రహణం నేపథ్యంలో విజయవాడ దుర్గ గుడి అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చంద్రగ్రహణం సందర్భంగా దేవస్థానం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం పది గంటలకు కనక దుర్గమ్మ ప్రధాన ఆలయం సహా ఉపాలయాల కవాట బంధనం చేయనున్నారు. పౌర్ణమి రోజున నిర్వహించే ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ రద్దు చేసినట్లు దుర్గ గుడి దేవస్థానం అధికారులు ప్రకటించారు. చండీ హోమం, శాంతి కళ్యాణం, పంచ హారతులు, పల్లకీ సేవ సహా ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు దుర్గ గుడి దేవస్థానం ప్రకటించింది. అనంతరం మార్చి 4వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు దుర్గమ్మ ప్రధాన ఆలయం, ఉపాలయాల కవాట ఉద్ఘాటన చేయనున్నారు. అనంతరం సుప్రభాతం, స్నపనాభిషేకం నిర్వహిస్తారు. ఆ తర్వాత అర్చన, మహానివేదన, హారతి కార్యక్రమాలు ఉండనున్నాయి. బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి భక్తులను అమ్మవారి సర్వదర్శనం కోసం అనుమతిస్తారు. నవగ్రహ శాంతి హోమం, వస్త్రం సేవ, ఖడ్గమాలార్చన, గణపతి హోమం రద్దు చేశారు. అలాగే బుధవారం ఉదయం ఏడున్నర గంటలకు నిర్వహించే ఆర్జిత సేవలను గంట ఆలస్యంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించుకోవాలని దుర్గ గుడి దేవస్థానం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రసిద్ధ దేవాలయాలు గ్రహణం సందర్భంగా మూసివేస్తున్నారు. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్ల దేవస్థానం ఆలయ ద్వారాలను మూసివేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అన్ని ఆర్జిత సేవలు, పరోక్ష సేవలు, శ్రీస్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవ టికెట్లను పూర్తిగా రద్దు చేశారు. చంద్ర గ్రహణం కారణంగా ఆ రోజంతా అన్నప్రసాద వితరణ ఉండదని, భక్తులు ఈ మార్పులను గమనించి సహకరించాలని ఆలయ ఈవో ఏం.శ్రీనివాసరావు కోరారు.

**తెరిచి ఉండే ఆలయాలు:** సాధారణంగా గ్రహణాల సమయంలో దేవాలయాలు మూసివేయడం అనేది ఆనవాయితీ. కానీ కొన్ని ప్రత్యేక నమ్మకాలు, ఆచారల కారణంగా గ్రహణ సమయంలో సూతక కాలంలో కూడా కొన్ని దేవాలయాలు తెరిచి ఉంటాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తి శివాలయం ప్రధానమైనది. గ్రహణం రోజున తెరచి ఉండే దేవాలయాల్లో గ్రహణ కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. అరుణాచలం, శ్రీకాళహస్తిలోని శివాలయాల్లోని శివలింగాలు స్వయంభువులు కావడం, ఇవి నవగ్రహాలను తమ ఆధీనంలో ఉంచుకోవడం కారణంగా పండితులు చెబుతారు. దైవిక శక్తి ఈ క్షేత్రాలను గ్రహణాల ప్రభావం నుంచి రక్షిస్తుందని ప్రగాఢ నమ్మకం. మన పురాణాల ప్రకారం శ్రీకాళహస్తిలో కొలువై ఉన్న వాయులింగేశ్వరుడు సూర్యచంద్రులు, అగ్నిభట్టారడితో పాటు నవగ్రహాలు, 27 నక్షత్రాలతో కవచాన్ని ఏర్పాటు చేసుకుని దర్శనమిస్తాడు. అందువల్ల ఈ శివ క్షేత్రానికి రాహువు, కేతువుల వల్ల ఎలాంటి నష్టం ఉండదు. వాస్తవానికి గ్రహణాల సమయంలో రాహుకేతువులు బలమైన శక్తిని కలిగి ఉంటారని నమ్మకం.

## లోకేష్ రెడ్‌బుక్‌కు వైసిపి భయపడదు

### - మాజీ మంత్రి కొడాలి నాని

విజయవాడ, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వ బెదిరింపులకు వైసిపి కార్యకర్తలు, నాయకులు భయపడరని మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నాయకులు కొడాలి నాని స్పష్టం చేసారు. కూటమి ప్రభుత్వం అంబటి రాంబాబు కుటుంబ సభ్యుల్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని మండిపడ్డారు. టిడిపి నేతలు కావాలనే అంబటి రాంబాబును రెచ్చగొట్టారని అన్నారు. అంబటి రాంబాబు బహిరంగంగానే క్షమాపణలు చెప్పినప్పటికీ, టిడిపి నేతలు ఆయన ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారని చెప్పారు. పోలీసుల సమక్షంలో అంబటి రాంబాబు ఇంటిపై దాడి జరిగిందని ఆరోపించారు. నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగానికి వైసిపి భయపడదని పేర్కొన్నారు. 2029లో వైసిపి అధికారంలోకి వస్తుంది, వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యమని అన్నారు.
ఇదిలాఉంటే, అంబటి రాంబాబును చింతలపూడి నియోజకవర్గానికి చెందిన వైసిపి నేతలు పరామర్శించారు. అంబటి రాంబాబు పార్టీకి చేసిన సేవలు అపారమని, ప్రజా సమస్యలపై ఎప్పుడూ ముందుండే నాయకుడని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనకు పార్టీ శ్రేణులంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏ పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. అంబటి రాంబాబు ఈ సందర్భంగా వచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం కలిసి పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చురుకుగా ఉండాలని పిలుపునిచ్చారు.

## యువ మనస్సుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

### ఐసర్ డైరెక్టర్ సంతాన భట్టాచార్య



శ్రీకాళహస్తి, మార్చి 2 ప్రభాతవార్త: యువకుల మనస్సుల్లో శాస్త్రీయ దృక్పథంను పెంపొందించటమే లక్ష్యంగా జాతీయ సైన్స్ సదస్సును నిర్వహించామని ఐసర్ డైరెక్టర్ సంతాన భట్టాచార్య అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన సైన్స్ సదస్సులో కేవలం ఆవిష్కరణలు, వేడుకలకు మాత్రమే కాదు. ఉత్సకత, విమర్శనాత్మక ఆలోచన, ఆధారాల ఆధారిత తార్కికతను పెంపొందించే మన బాధ్యతను తిరిగి ధ్రువీకరించటం లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు భట్టాచార్య వివరించారు. ఐసర్‌లో పరిశోధన సంస్కృతి సైన్స్‌తో ప్రజల నిశ్చితార్థాన్ని బలోపేతం చేయటానికి కట్టుబడి ఉన్నామని ఆయన వివరించారు. సదస్సులో ఎన్నో ఆవిష్కరణలు, ఎన్నో కొత్త విషయాలను రూపకల్పన చేసారన్నారు. పరిశోధనా మార్గాలు అవిష్కరణలు శాస్త్రీయ విచారణ సామాజిక ఔచిత్యంపై ఉత్సాహభరితమైన చర్చలకు దారి తీశాయన్నారు.
మూడు రోజుల సైన్స్ సదస్సులు పరిశోధనా రంగంలో కొత్త శకానికి శ్రీకారం చుట్టిందని పలువురు వక్తలు వివరించారు. సోమవారం నాటి ముగింపు సమావేశంలో బొంబాయి ఐఐటి నుంచి కెమిస్ట్రీ విభాగం అధిపతి ప్రొఫెసర్ రుచి ఆనంద్, బోస్ ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కౌస్తు సన్యాల్, ఎన్‌సిబి ప్రభుత్వ వైద్యకళాశాలలోని రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ధనంజయ శర్మ పాల్గొన్నారు.

## తిరుమల క్యూలైన్‌లో భక్తుల ఘర్షణ

తిరుమల, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్డులో కృష్ణ తేజ అతిథి భవనం సమీపంలోని క్యూలైన్లలో వేచి ఉండే సమయంలో ఇరువురు భక్తులు పరస్పర ఘర్షణకు దిగారు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది, శ్రీవారి సేవకులు వెంటనే అప్రమత్తం కావడంతో ఘర్షణను నిలువరించారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు ఈ విధంగా పరస్పర ఘర్షణకు దిగడం సమంజసం కాదని, ఓర్పుతో, సహనంతో వ్యవహరిస్తూ తోటి భక్తులతో స్నేహ పూర్వకంగా ఉండాలని టిటిడి కోరింది. అదేవిధంగా క్యూలైన్ నియమాలను తప్పనిసరిగా పాటించి స్వామివారిని దర్శించుకోవాల్సిందిగా టిటిడి విజ్ఞప్తి చేసింది.

## గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగోళ్లకు అండగా ఉంటాం

### - టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విజయవాడ, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: గల్ఫ్ దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ చిక్కుకున్న తెలుగు వారికి పూర్తి స్థాయిలో అండగా ఉంటామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన తెలుగు బిడ్డలకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకోవడానికి తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.
గత నాలుగు రోజులుగా గల్ఫ్ దేశాల్లో మారుతున్న పరిణామాలను ఎన్ఆర్ఐ టిడిపి సెల్ నిశితంగా గమనిస్తోందని పల్లా వెల్లడించారు. టిడిపి కేంద్ర కార్యాలయం నుంచి ప్రత్యేక బృందం ఎప్పటికప్పుడు గల్ఫ్ దేశాల కోఆర్డినేటర్లతో టెలికాన్ఫరెన్సులు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తోందని, ఎక్కడైతే అత్యవసర సహాయం అవసరమో, అక్కడ తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్కడి ఎన్ఆర్ఐ టిడిపి విభాగం సభ్యులు, తెలుగు సోదరులు బాధితులకు అవసరమైన తాత్కాలిక వసతి, ఆహారం, భద్రతా ఏర్పాట్లు చేయడంలో చురుగ్గా పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని పల్లా తెలిపారు.



## ఒకే కుటుంబ సభ్యులు నలుగురు అదృశ్యం

రొళ్ల, మార్చి 2 (ప్రభాతవార్త): శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలంలో వేధింపులు తాళలేక ఇద్దరు బాలికలు, ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. రొళ్ల మండలం హెచ్డి వడ్రహట్టిలో ఉంటున్న రామప్ప, సుబ్బమ్మ దంపతులకు నలుగురు సంతానం. రామప్ప ఇప్పటికే మృతి చెందారు. మూడో కుమార్తె లక్ష్మీ అదే గ్రామానికి (హెచ్‌టి హాళ్లి వడ్రహట్టి) చెందిన వీరేష్‌ను ఇష్టపడటంతో 13 ఏళ్ల క్రితం పెళ్లి చేశారు. అయితే ఏడాదిగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఇదే విషయంపై రెండు మూడు సార్లు పెద్ద మనుషుల సమక్షంతో పాటు పోలీస్ స్టేషన్‌లో పంచాయతీలు చేసినా వీరేష్‌లో ఎలాంటి మార్పు రాలేదు. గత నెల 27న ఉదయం వీరేష్, భార్య లక్ష్మీతో గొడవ పడ్డారు. ఇంట్లోనే ఉంటే నీఅంతు చూస్తానని ఆమెను భర్త బెదిరించాడు. వీటినన్నింటిని గమనించిన తల్లి సుబ్బమ్మ కుమార్తె లక్ష్మీతో పాటు మనవరాళ్లు రోహిణి, రచనలతో అదే రోజు రాత్రి మనవరాళ్లతో కలిసి తల్లీకూతుళ్లు సుబ్బమ్మ, లక్ష్మీ అదృశ్యమయ్యారు. గత నాలుగు రోజులుగా అన్నిచోట్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో సుబ్బమ్మ పెద్ద కుమార్తె పార్వతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌతమి తెలిపారు. ఇదే ఘటనపై ఎస్ఐ గౌతమిను వివరణ కోరగా దర్యాప్తుల్లో ఎలాంటి అంచుకి లభ్యం కాలేదు అన్నారు. త్వరలోనే గుర్తిస్తామని వివరించారు.



## రూ.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

### -195 ఎర్రచందనం దుంగలు, 3 వాహనాలు పట్టివేత

తిరుపతి, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం అటవీప్రాంతం నుండి అక్రమంగా తరలించేసిన భారీ మొత్తంలో ఎర్రచందనం దుంగలను, వాటిని తరలించిన వాహనాలను తిరుపతి అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసులు పట్టుకున్నారు. ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న 8 మంది అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ అరెస్ట్ చేసింది. తిరుపతి కపిలతీర్థంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో చీఫ్ లంకెల సుబ్బరాయుడు, ఎస్పీలు శ్రీనివాస్, కులశేఖర్ మీడియా ప్రతినిధులకు వివరించారు. అక్రమ రవాణాలో పాల్గొన్న స్మగ్లర్లను పథకం ప్రకారం అరెస్ట్ చేశామని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి జిల్లాలో విస్తరించిన శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందన అక్రమ రవాణా నిరోధక దళం కఠినంగా చర్యలు తీసుకుంటోంది. చీఫ్ లంకెల సుబ్బారాయుడు మార్గదర్శకత్వంలో ఎస్పీ శ్రీనివాస్, పర్యవేక్షణ కులశేఖర్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఎప్పటికప్పుడు ప్రత్యేక ఆపరేషన్‌లు నిర్వహిస్తోంది. కర్ణాటక హసన్ జిల్లా అర్సికేరిత సిద్ధాపూర హరత్నాహళ్లి గ్రామంలో కర్ణాటక పోలీసుల సహకారంతో సమీపంలో ఉన్న గోడౌన్ వద్ద భారీ ఎర్రచందనం దుంగలు నిల్వను ఛేదించామన్నారు. సంఘటనాస్థలికి సమీపంలోని కోళ్ళఫారం ఓపెన్ రేకుల షేడ్‌లో దాచిన 195 ఎర్రచందనం దుంగలు, ఎర్రచందనం రీపర్లు కనుగొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకి ఉపయోగించిన మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనాల విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని తెలిపారు. అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాన్ని అభినందించి, రివార్డులు ఇస్తామని సుబ్బరాయుడు తెలిపారు.

## శ్రీకాకుళంలో ఎసిబి సోదాలు

శ్రీకాకుళం, మార్చి 2 ప్రభాతవార్త: జిల్లాలోని అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్‌గా పని చేస్తోన్న గడ్డి బాలముకుందం ఇంట్లో ఎసిబి అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని డిసిసిబి కాలనీలో గల బాలముకుందం ఇంట్లో ఎసిబి డిఎస్పీ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో సిఐ భాస్కర్ ఇతర సిబ్బంది కలిసి సోదాలు చేశారు. బాలముకుందం ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న అభియోగంపై ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. కంచిలి బిసి హాస్టల్‌లో ఇటీవల ఎసిబి అధికారులు తనిఖీలు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడిన రూ.1,84,070లను గుర్తించారు. ఎబిసి డబ్ల్యుఓతో వసూళ్లకు పాల్పడ్డ వార్డెన్లపై విచారణ చేసి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఎసిబి అధికారులు పంపించారు. ఎసిబి అధికారుల విచారణలో ఎబిసిడబ్ల్యుఓ బాలముకుందం అవినీతికి పాల్పడుతున్నట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న అభియోగంపై ఎబిసిడబ్ల్యుఓపై ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. అందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని డిసిసిబి కాలనీలో నివాసం ఉంటున్న బాలముకుందం ఇంటిలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో బంగారం, వెండి వస్తువులతో పాటు నగదును గుర్తించారు. కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణను కొనసాగిస్తున్నారు. సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎసిబి అధికారులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## మత్తు మాత్రలతో దొంగతనం.. మహిళ అరెస్ట్

తిరుమల, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: భక్తురాలిగా నటిస్తూ తోటిభక్తులకు శీతల పానీయాల్లో, నీళ్ళలో మత్తుమాత్రలు కలిపి దొంగతనం చేస్తున్న నిందితురాలిని తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుండి 8.4 గ్రాముల బంగారు గొలుసు, నిద్ర మాత్రలు, ఒక ఇనుప కట్టర్, ఒక చీర ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. తిరుమలలో దొంగతనాల నియంత్రణపై తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తీవ్ర నిఘా ఉంచారు. తిరుమలకు వచ్చిన వృద్ధ మహిళను లక్ష్యంగా చేసుకుని మత్తు మాత్రలు ఇచ్చి బంగారు తాళిబొట్టు చైన్ దొంగతనం చేసిన వల్లి(56) గుంటూరు జిల్లా జాన్సీ నగర్ కాగా, ప్రస్తుతం తమిళనాడులో నివసిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తిరుమలలోని బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద వృద్ధురాలిని నమ్మబలికి, ఆమెకు టీలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చి, ఆమె మెడలో ఉన్న 73 గ్రాముల బరువున్న బంగారు తాళిబొట్టు చైన్‌ను అపహరించింది. తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భక్తులు అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలు, పానీయాలు, మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించవద్దని పోలీసులు సూచించారు.

## హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య



ప్రొద్దటూరు క్రైం, మార్చి 2, ప్రభాతవార్త: పొద్దుటూరులోని నడింపల్లి హాస్టల్‌లో తలారి నర్సింహులు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మైలవరం మండలం కల్లుట్ల గ్రామానికి చెందిన తలారి ఓబులేసు కుమారుడు తలారి నర్సింలు ప్రొద్దుటూరులోని నడింపల్లి ఎస్సీ హాస్టల్లో ఉంటున్నాడు. ప్రస్తుతము పదవ తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ తరుణంలో ఆదివారం పొట్లదుత్తిలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. రాత్రి భోంచేసిన తర్వాత రాత్రి 7.30 గం.ల సమయంలో హాస్టల్ దగ్గర బైక్‌పై పెద్దనాన్న వదిలిపెట్టి వెళ్లారు. రాత్రి 11 గంటల వరకు స్నేహితులతో ఉల్లాసంగా గడిపాడు. ఉదయం ఐదున్నర గంటలకు స్నేహితులు హాస్టల్ బయట చూడడంతో నేరేడుచెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. ఈ విషయం వెంటనే హాస్టల్ వార్డును బ్రహ్మానందరెడ్డికి ఫోన్ల ద్వారా విద్యార్థులు సమాచారం అందించారు. వెంటనే హాస్టల్‌కు చేరుకొని మృతి చెందిన నర్సింహులను ఆఫీస్ రూమ్‌కు తరలించి, విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు రాత్రి బాగున్నావ్, ఇలా ఎలా జరిగింది? మా కొడుకు చనిపోయేంత పిరికివాడు కాదు, ఎవరో చంపేశారని ఆరోపిస్తూ రోదించారు. విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న అధికారులు డిడి సరస్వతి, డిఇఓ శంషుద్దీన్ శోభారాణి తదితరులు అక్కడికి చేరుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని అధికారుల నిర్లక్ష్యతోనే విద్యార్థి మరణించాడని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లపోతుల నాగరాజు అక్కడికి చేరుకొని ద్యార్థి చావుకు కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించి విద్యార్థులు తల్లిదండ్రులకు న్యాయం చేయాలని టౌన్ సిఐని కోరారు. టూ టౌన్ సిఐ కేసు నమోదు చేసుకొని నర్సింహులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎపిఈఎపిసెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

విజయవాడ, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎపిఇఎపి సెట్ దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని పొడిగిస్తున్నట్లు కన్వీనర్ ఎన్.మోహన్‌రావు వెల్లడించారు. ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో 17వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ.వెయ్యితో మార్చి 21, రూ.2 వేలతో మార్చి 25, రూ.4 వేలతో మార్చి 30, రూ.10 వేలతో ఏప్రిల్ 3 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తుల తప్పుల సవరణకు ఏప్రిల్ 4-6 వరకు అవకాశం కల్పించారు. పరీక్షల నిర్వహణ తేదీల్లో ఎలాంటి మార్పులు ఉండబోవు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు మే 12 నుంచి 15 వకు, 18న నిర్వహిస్తారు. వ్యవసాయ, ఫార్మసీ పరీక్షలు మే 19, 20 తేదీల్లో ఉంటాయి. ప్రాథమిక 'కీ' మే 23న విడుదల చేసి, 25 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఫలితాలు జూన్ 1న ప్రకటిస్తారు.




## ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దులో మత్స్యకారుల సమస్యల పరిష్కారం

### - సమన్వయంతో సేవలంటున్న తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, మార్చి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో మత్స్యకారులకు ఎదురవుతున్న అంతర్‌రాష్ట్ర సమస్యల శాశ్వత పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. ఇరు రాష్ట్రాల జిల్లాలలో సరిహద్దు ప్రాంతాలపై స్పష్టత లేకపోవడం వల్ల మత్స్యకారుల మధ్య అపోహాలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. గతంలో చోటుచేసుకున్న సంఘటనలను సమీక్షించి, భవిష్యత్తులో అలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పులికాట్ సరస్సు పరిధిలో జీవనోపాధి కొనసాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు ఇటీవలి కాలంలో ఎదుర్కొంటున్న వివాదాలు, సరిహద్దు సమస్యలు, భద్రతా అంశాలు వంటి విషయాలపై చర్చించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, డిఆర్ఒ జి.నరసింహులుతో కలసి తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఎస్పీ వివేకానంద శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఇరు రాష్ట్రాలకు సంబంధిత అధికారులందరూ సమన్వయం చేసుకుని అవసరమైతే సంయుక్త పహారా, హాట్‌లైన్ సమన్వయం, తక్షణ సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి విషయాలపై చర్చించారు. త్వరలో అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన చేపడతామని తెలిపారు. తమిళనాడు వైపు మత్స్యకారులు, సబ్‌డివిజనల్ అధికారుల నుండి కొద్దిమంది ప్రతినిధుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. గుమ్మిడిపూడి తాసీల్దార్ కార్యాలయం వద్ద సరిహద్దు సమస్యలపై రానున్న శుక్రవారం సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు.
ఇరు రాష్ట్రాల నుంచి మత్స్యకార సంఘాల ప్రతినిధులు, రెవెన్యూ, పోలీస్, ఫిషరీస్ అధికారులు పాల్గొనాలని తెలిపారు. సమస్య ఉన్న గ్రామాలైన చిన్న మంగడ, పెద్ద మంగడ, పుడుకుప్పం, కీర పాక్కం ఈ గ్రామాల నుంచి ఇద్దరు ముగ్గురు ముఖ్య ప్రతినిధులను తీసుకురావాలని చర్చించారు. చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖల అధికారులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఏవైనా సమస్యలు లేదా అవరోధాలు ఏర్పడితే, సంబంధిత శాఖలతో సంప్రదించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు సూళ్లూరుపేట ఆర్‌డిఒ దేవేందర్ రెడ్డి, సూళ్లూరుపేట, గుమ్మడిపూడి డిఎస్పీలు, సూళ్లూరుపేట డిఎఫ్ఒ, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

